ప్రభుత్వానికి ప్రజలే షాకిస్తారు

- విద్యుత్ చార్జీలు తగ్గించాలని రోడ్డెక్కిన సామాన్యులు
- ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరిక
- పోరుబాటకు వైఎస్సార్ సీపీ శ్రేణుల సంపూర్ణ మద్దతు
- ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద భారీ నిరసన ప్రదర్శన



ఆందోళన చేస్తున్న కేకే రాజు



కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు ఆధ్వర్యంలో ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు

సీతమ్మధార : సంపద సృష్టిస్తామని.. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు ప్రజలకే కరెంట్ షాక్ ఇవ్వడంతో సామాన్యులు రోడ్డెక్కారు. విద్యుత్ చార్జీల పెంపుపై పోరుబాటతో నియోజకవర్గం హోరెత్తింది. తక్షణమే భారం దించకపోతే కూటమి సర్కారుకి షాకిస్తామంటూ నగరవాసులు హెచ్చరించారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రోడ్డెక్కిన జనానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే రాజు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, శ్రేణులు బాసటగా నిలిచారు. విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శనతో గర్జించారు. ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు ఆధ్వర్యంలో గురుద్వార్ జంక్షన్ నుంచి వైఎస్సార్‌సీపీ పోరుబాటు ప్రారంభమైంది. ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని.. చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలంటూ హెచ్చరికలు జారీ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పండుల రవీంద్రబాబు, మాజీ శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి, మళ్ల విజయప్రసాద్, తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకటరామయ్య, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, కార్పొరేటర్లు పాదయాత్రగా వస్తూ ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయానికి చేరుకున్నారు. డిస్కమ్‌ల అధికారులకు వినతిపత్రం అందించేందుకు యత్నించగా.. శాంతియుత నిరసనని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. కార్యాలయం గేట్లు మూసేసి ఆందోళన అణచివేతకు ప్రయత్నిస్తూ.. కవ్వింపు చర్యలకు పాల్పడేందుకు యత్నించారు. కానీ వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు ఏమాత్రం సహనం కోల్పోకుండా కేవలం వినతిపత్రం అందించి వస్తామంటూ పోలీసులకు స్పష్టం చేయడంతో కొందరిని మాత్రమే లోపలికి అనుమతించారు. అంతా కలిసి విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలని కోరుతూ సీజీఎం, ఇన్‌చార్జి ఆపరేషనల్ డైరెక్టర్ విజయలలితకు వినతిపత్రాన్ని అందించారు. పోరుబాట కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్యాలయం పర్యవేక్షకులు రవిరెడ్డి, రాష్ట్ర అనుబంధ విభాగం అధ్యక్షులు వంగపండు ఉష, పేర్ల విజయ్ చంద్ర, పోతిన శ్రీను, పార్టీ ముఖ్య నాయకులు చొక్కాకుల వెంకటరావు, తిప్పల దేవన్ రెడ్డి, జహీర్ అహ్మద్, మొల్లి అప్పారావు, రొంగలి జగన్నాథం, పేడాడ రమణికుమారి, మాధవి వర్మ, నడింపల్లి కృష్ణంరాజు, గండి రవి కుమార్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు స్వాతి దాస్, కెల్ల సునీత, అనిల్ కుమార్ రాజు, మువ్వల లక్ష్మి సురేష్, సాడి పద్మా రెడ్డి, బిపిన్ కుమార్ జైన్, ఆళ్ల శంకర్రావు, రెయ్యి వెంకట రమణ, శశికళ, కో ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు పాల్గొన్నారు.



కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని నినాదాలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు

కూటమి నిజ స్వరూపం తెలుస్తోంది



కూటమి ప్రభుత్వ నిజ స్వరూపం క్రమంగా ప్రజలకు తెలుస్తోంది. ఇప్పటికే ఉచిత బస్సు పథకం అమలు చేయలేక చేతులెత్తేశారు. తాజాగా ఎన్నికల్లో ఇచ్చిన హామీని ఉల్లంఘించి మరీ విద్యుత్ చార్జీలు పెంచిన కూటమి ప్రభుత్వం నిజస్వరూపం ప్రజలకు అర్థం అవుతోంది. ప్రజలే కూటమి నాయకులకు బుద్ధి చెబుతారు.
– చొక్కాకుల వెంకటరావు, మాజీ చైర్మన్, పీసీపీఐఆర్, విశాఖపట్నం

విశాఖ ప్రజలపై రూ.293 కోట్ల భారం



గత ఎన్నికల్లో విద్యుత్ బిల్లులు పెంచేది లేదని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు ప్రస్తుతం భారీగా చార్జీలు పెంచడం దారుణం. కూటమి ప్రభుత్వం నిర్వాకంతో ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రజలపై రూ.293 కోట్ల మేరకు అదనపు భారం పడుతోంది. చార్జీలు తగ్గించకపోతే సామాన్యులతో కలిసి ఉద్యమిస్తాం.
– పేడాడ రమణికుమారి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం

మాట తప్పిన ఘనత చంద్రబాబుదే..



విద్యుత్ చార్జీల పెంపుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట తప్పినట్టయింది. ఇప్పటికే ఉచిత బస్సు పథకం అంటూ ఊరించి ఉసూరుమనిపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి భిన్నంగా అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విద్యుత్ చార్జీలు పెంచడంతో మరోసారి మాట తప్పిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది.
– బెందాళం పద్మావతి, మహిళా జోనల్ ఇన్‌చార్జి, వైఎస్సార్ సీపీ

రాష్ట్ర ప్రజలపై భారం మోపడం అన్యాయం



విద్యుత్ చార్జీలు పెంచడం అన్యాయం. రాష్ట్ర ప్రజల మీద వేల కోట్ల రూపాయల అదనపు భారం మోపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి తిలోదకాలు ఇచ్చి మరీ విద్యుత్ చార్జీలు పెంచడం సరికాదు. రాష్ట్ర వ్యాప్తంగా సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలంతా ఆగ్రహంతో ఉన్నారు.
– కటారి అనిల్‌కుమార్, కార్పొరేటర్, 14వ వార్డు, వైఎస్సార్ సీపీ

క్లుప్తంగా

29న పోర్టు పెన్షనర్ల వనభోజనాలు

మల్కాపురం : హార్బర్ అండ్ పోర్టు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం, వన భోజనాలు ఈ నెల 29న నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాధవధార మాధవస్వామి ఆలయం వద్ద ఉన్న మామిడి తోటల్లో నిర్వహిస్తున్న సమావేశంలో పెన్షనర్లు పాల్గొని సమస్యలు తెలియజేయాలన్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి వన భోజనాల్లో ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం రేపు

మురళీనగర్ : మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కిమ్స్ ఆస్పత్రి సహకారంతో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, పి.చెల్వారాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు నిర్వహించనున్న శిబిరంలో ఈసీజీ, ఆబీఎస్, బీపీ ఇతర సాధారణ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కార్డియాలజిస్టు డాక్టర్ గణేష్ కాశీనాథుని, టాటా మెమోరియల్ ఆస్పత్రి ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి పుచ్చ, కిమ్స్ ఆస్పత్రి సాధారణ వైద్య నిపుణులు డాక్టర్ మల్ల అరవింద్ పాల్గొంటారని తెలిపారు. మురళీనగర్ పరిసర ప్రాంత ప్రజలు, వాకర్స్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సీతమ్మధార : విద్యుత్ హెచ్‌టీ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం ఉదయం 09 : 30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఈఈ సింహాచలం నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్, మోర్ సూపర్ మార్కెట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మన్మోహన్‌సింగ్ మరణం తీరని లోటు

కంచరపాలెం : ఆర్థిక సంస్కరణల సారథి, భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మరణంతో దేశం గొప్ప మేధావిని కోల్పోయిందని పద్మశ్రీ పురస్కార గ్రహీత, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ కూటికుప్పల సూర్యారావు శుక్రవారం సంతాపం తెలిపారు. 2008లో మన్మోహన్ సమక్షంలో పద్మశ్రీ అవార్డు అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. మన్మోహన్‌సింగ్ కుటుంబానికి సంతాపం తెలియపరిచారు.

గోవిందనామాలు.. జీవనముక్తికి సోపానాలు



వేషధారణలతో ఆకట్టుకున్న చిన్నారులు

ఎంవీపీకాలనీ: గోవిందనామాలు జీవనముక్తికి సోపానాలని ఆకెళ్ల విభీషణ శర్మ అన్నారు. శ్రీ సుదర్శన సీతారామాచార్యులు నేతృత్వంలో, ఉదయగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని భద్రం పార్కులో శ్రీ వేంకటేశ్వర వైభవం పేరిట నిర్వహిస్తున్న ప్రవచన కార్యక్రమం రెండో శుక్రవారం విశేషంగా సాగింది. ఈ సందర్భంగా విభీషణ శర్మ వేంకటేశ్వర వైభవంపై చేసిన ఆధ్యాత్మిక ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. దేవదేవుడు శ్రీనివాసుడు కొలువైన ఏడుకొండలను సరిగమపదనిసలుగా భావించి మహోన్నత వాగ్గేయకారులైన అన్నమాచార్య, త్యాగరాజు శ్రీవారిని కీర్తించి తరించారన్నారు. వారి బాటలోనే విశ్వవ్యాప్తంగా ఉన్న భక్తులు వివిధ కార్యక్రమాల ద్వారా శ్రీవారిని కీర్తించడం, సేవించడం ద్వారా ప్రశాంత జీవనం పొందగలరని చెప్పారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన వివిధ రకాల వేషధారణలు భక్తులను అలరించాయి. కందాళ అరుణగాయత్రి, డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

596 జీవో ప్రకారం ఫ్రీ హోల్డ్ హక్కు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపల్లి వెంకటరమణ

సీతంపేట : గత ప్రభుత్వంలో అసైన్డ్ భూముల ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్ల విషయంలో 135 ఎకరాల్లో అవకతవకలు జరిగాయన్నది ఆరోపణ మాత్రమేనని ప్రస్తుత ప్రభుత్వం వేసిన ఏక సభ్య కమిషన్ తేల్చేసిందని నవయానం బహుజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటరమణ అన్నారు. రామా టాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో అసైన్డ్ భూముల ఫ్రీ హోల్డ్ నిర్లక్ష్య బాధితులు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 596 జీవో ద్వారా గత ప్రభుత్వం సుమారు 300 మందికి సంబంధించిన 609 ఎకరాలకు ఫ్రీ హోల్డ్ హక్కు... అంటే అసైన్డ్ భూమిని అమ్ముకునే హక్కు కల్పించిందన్నారు. ఫ్రీ హోల్డ్ కింద సుమారు నాలుగు వేల ఎకరాల వరకు రిజిస్ట్రేషన్ కావాల్సి ఉందని, ప్రస్తుతం171 ఎకరాలకు మాత్రమే ఫ్రీ హోల్డ్ కింద విక్రయాలు జరిగాయన్నారు. ఫ్రీ హోల్డ్ భూముల విక్రయాల వల్ల అన్యాయం జరిగిందని ఎవరూ ఇప్పటి వరకు రోడ్డెక్కలేదని, అధికారులకు ఫిర్యాదులు చేయలేదన్నారు. రాజకీయ పార్టీలే తమ స్వార్థం కోసం అన్యాయం జరిగినట్టు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వ విచారణతో ఆరోపణలు అవాస్తమని తేలిపోయిందన్నారు. విశాఖ జిల్లాలో సుమారు 6,738 ఎకరాల భూములుంటే అందులో 609 ఎకరాలకు మాత్రమే ఫ్రీ హోల్డ్ హక్కు లభించిందని, మిగిలిన భూములకు కూడా 596 జీవో ప్రకారం ఫ్రీ హోల్డ్ హక్కు కల్పించాలని కోరారు.

ఖాతాదారులకు నమ్మకమైన సేవలు



బ్యాంకు వద్ద వైద్య శిబిరంలో ఖాతాదారులు, సిబ్బంది

సీతంపేట : గత 25 ఏళ్లుగా ఖాతాదారులకు నమ్మకమైన సేవలందించి అభివృద్ధి పథంలో పయనిస్తున్నామని కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంకు మేనేజర్ బి.రామారావు అన్నారు. కోస్టల్ బ్యాంకు స్థాపించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో గల కార్యాలయంలో శుక్రవారం సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు 25 ఏళ్ల మైలురాయిని చేరుకోవడం ఆనందంగా ఉందన్నారు. కస్టమర్ల విశ్వాసం, సిబ్బంది అంకిత భావంతోనే సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని స్టీల్ ప్లాంట్ జీఎం ఎస్.ఎస్.ఎస్.శ్యామలరావు, విశ్రాంత ఆచార్యులు ఎం.డి.బేగ్, షేర్ హోల్డర్ సీహెచ్.బాలకామేశ్వరి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కర్రి శంకరరావు, వి.వి.రాజు, ఎస్.గురవారెడ్డి, కందుల అనురాధ, బ్యాంకు సిబ్బంది, ఖాతాధారులు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు బిహార్ యువకుడు



కుటుంబ సభ్యులతో బిపిన్‌కుమార్

సీతమ్మధార: రైల్వేస్టేషన్‌లో మతిస్థిమితం లేక సంచరిస్తున్న బిపిన్‌కుమార్‌ను ఏయూటీడీ సిబ్బంది వెంబడించి పట్టుకుని ద్వారకానగర్‌లో గల టీఎస్ఆర్ కాంప్లెక్సులోని జీవీఎంసీ–ఏయూటీడీ పురుషుల షెల్టర్ హోంకు తరలించారు. నాలుగు నెలల పాటు అబ్జర్వేషన్‌లో ఉంచి వైద్యం అందించారు. దీంతో అతను కోలుకుని తన వివరాలు చెప్పాడు. తనది బిహార్‌కు చెందిన సుపాల్ జిల్లాలోని కుల్లిపట్టి గ్రామం అని వివరించాడు. తల్లితో పాటు ఇద్దరన్నదమ్ములు ఉన్నారని చెప్పాడు. అతను ఏడేళ్ల నుండి మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. తల్లి వద్దన్నా వినకుండా పని కోసం ఇల్లు వదిలి వెళ్లాడు. సంవత్సరం నుండి కొడుకు కనబడకపోవడంతో ఆ తల్లి తల్లడిల్లిపోయింది. అతన్ని వైజాగ్ నుంచి తీసుకెళ్లి తల్లి మీనాదేవి, సోదరుడు హరి పాశ్వాన్‌కు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

అమ్మవారికి సారె సమర్పణ



అమ్మవారికి భక్తులు సమర్పించిన సారె

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి అమ్మవారి భక్తులు సారె నివేదించారు. పండ్లు, పిండివంటలు, స్వీట్లు తదితర సారె సామగ్రిని అమ్మవారి ముంగిట చేర్చారు.

సాంస్కృతిక పోటీలు రేపు

సీతమ్మధార : క్షత్రియ మహిళలు, పిల్లలకు ఆదివారం సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తామని క్షత్రియ సంక్షేమ సమితి కార్యదర్శి ఆర్.వి.గణపతిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు డ్రాయింగ్, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు, క్విజ్, పాటల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. సాయంత్రం విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. వివరాల కోసం 8978267198లో సంప్రదించాలని ఆయన కోరారు.

గోమాత రక్షణకు విశ్వ ప్రయత్నం

మురళీనగర్ : మురళీనగర్‌లోని ఒక ఫంక్షన్ హాల్ సమీపంలోని నూతిలో పడిపోయిన గోమాతను రక్షించేందుకు అగ్నిమాపక దళం సిబ్బంది చేసిన ప్రయత్నం ఫలించ లేదు. శుక్రవారం సాయంత్రం నూతిలో ప్రమాదవశాత్తు పడిపోయిన గోవును స్థానిక మహిళ ఒకరు గమనించి మల్కాపురం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. విషయం తెలియగానే ఫైర్ ఆఫీసర్ ప్రసాదరావు ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గోమాతను రక్షించేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే ప్రాణాలు కోల్పోయి విగతజీవిగా మారడంతో సిబ్బంది, స్థానికులు విచారం వ్యక్తం చేశారు.

అధికారిక భాషను ప్రోత్సహించండి

తాటిచెట్లపాలెం : అధికారిక భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రోత్సహించాలని డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ సూచించారు. ప్రతీ ఉద్యోగి అధికారిక భాషలో మాట్లాడడం, రాయడం నేర్చుకోవాలని కోరారు. డివిజినల్ అధికారిక భాష అమలు 4వ త్రైమాసిక సమావేశం శుక్రవారం దొండపర్తిలో గల డీఆర్ఎం కార్యాలయంలో మనోజ్‌కుమార్ సాహూ అధ్యక్షతన నిర్వహించారు. గత క్వార్టర్‌లో జరిగిన పలు కీలక విషయాలపై సమావేశంలో చర్చించారు. అనంతరం సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఎంఎస్ఎన్ మూర్తి హిందీలో సాంకేతిక సెమినార్ నిర్వహించారు. సెమినార్‌లో రాజభాష అధికారి, అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ సంతోష్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువతే సమాజానికి దిక్సూచి



బహుమతి అందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు రమణి, డాక్టర్ సునీల్‌కుమార్

మహారాణిపేట: నేటి యువత సమాజానికి దిక్సూచి కావాలని ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం 29వ వార్డు హైస్కూల్ ఆవరణలో వీరబాల దివస్ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దేశం కోసం బలిదానాలు చేసిన ఎందరో అమరవీరులను నేటి సమాజానికి, యువతకు పరిచయం చేయటమే లక్ష్యంగా ప్రధాని మోదీ కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. అబ్దుల్ కలాం, నేతాజీ, ఆజాద్ చంద్రశేఖర్, భగత్‌సింగ్, సుఖదేవ్ వంటి వీరులను స్మరించుకుంటూ, వారి అడుగుజాడల్లో పయనించాలని కోరారు. వీరబాల దివస్‌పై పలు పోటీలు నిర్వహించి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ముఖ్య అతిథి చేతుల మీదుగా అందజేశారు.

తెలుగు భాషను కాపాడుకోవాలి



మాట్లాడుతున్న ఆచార్య నాగేశ్వరరావు

సీతంపేట : తెలుగు భాషను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, భావితరాలు మాతృభాషకు దూరం కాకూడదని ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వరరావు అన్నారు. విశ్వ సాహితి లలిత కళా వేదిక ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం శ్రీగణపతిరాజు ఈశ్వర వర్మ స్మారక సాహిత్య కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మాతృభాష గొప్పతనాన్ని, ప్రాముఖ్యతను పిల్లలకు వివరించాలన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ప్రముఖ పాత్రికేయులు జంధ్యాల శరత్‌బాబు పత్రికలు, సారస్వత బాధ్యత అనే అంశంపై మాట్లాడారు. గతంలో వివిధ ప్రక్రియల్లో వచ్చిన రచనలు ప్రచురిస్తూ రచయితలను ప్రోత్సహించడంలో పత్రికలు విశిష్ట భూమిక పోషించాయని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం సాహిత్య పత్రికలు చదివే వారు లేక మూతపడుతున్నాయని, జాతీయోద్యమంలో సాహిత్య పత్రికలు గొప్ప పాత్ర నిర్వహించాయని గుర్తు చేశారు. సాహితీవేత్తలు శేఖరమంత్రి ప్రభాకర్, వి.నాంచారయ్య, బి.వెంకటరావు, కె.రఘువీర్ పాల్గొన్నారు.

యాన్సీన్ వే కన్సల్టెన్సీపై చీటింగ్ కేసు నమోదు

సీతమ్మధార : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఒక కన్సల్టెన్సీ మీద చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోర్టు స్టేడియం సమీపంలో గల గ్రీన్ పార్క్ కాలనీలో యాన్సీన్ వే కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నారు. ఫిర్యాదుదారు పిఠాపురపు వెంకటరమణ స్థానిక బాలయ్య శాస్త్రి లే అవుట్ వద్ద టీ దుకాణం నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. అతని భార్య లావణ్య గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో వారు ఒక పత్రికలో యాన్సీన్ వే కన్సల్టెన్సీ ద్వారా విదేశాల్లో ఉద్యోగాలకు సంబంధించిన ప్రకటన చూశారు. అనంతరం నిర్వాహకులను సంప్రదించడంతో యూరప్‌లోని మాల్టాలో స్టోర్ క్యాషియర్ పోస్టు కోసం కొన్ని ఖాళీలు ఉన్నాయని చెప్పారు. ఆ ఉద్యోగం కోసమని యాన్సీన్ వే కన్సల్టెన్సీకి రూ.6.2 లక్షలు చెల్లించారు. ఈ ఏడాది జూన్ 19న విజిటింగ్ వీసా ద్వారా లావణ్యను పారిస్‌కు, ఆపై మాల్టాకు పంపారు. అయితే అక్కడకు వెళ్లిన తర్వాత హౌస్‌కీపింగ్ ఉద్యోగంలో చేర్చడానికి ప్రయత్నించడంతో ఆమె భర్తకు విషయం తెలియజేసింది. వెంటనే వెంకటరమణ యాన్సీన్ వే కన్సల్టెన్సీ నిర్వాహకులు శ్రీనివాస్, రవి కుమార్‌పై ఒత్తిడి తీసుకురావడంతో రూ.1.5 లక్షలు వాపస్ చేశారు. అయితే మిగిలిన రూ.4.70 లక్షలు వాపస్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితుడు వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసుని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్నారు. విదేశాల్లో ఉద్యోగాలు ఇస్తామని చెప్పే కన్సల్టెన్సీలతో అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు.

నూతన సంవత్సర ఉత్సవాలకు ఏర్పాట్లు

మురళీనగర్ : నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఈ నెల 31న మురళీనగర్ వైశాఖి స్పోర్ట్సు పార్కులో ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పార్కు అధ్యక్ష, కార్యదర్శులు సనపల వరప్రసాద్, పీవీ సూర్యనారాయణ రాజు తెలిపారు. ఈ మేరకు పార్కు కమిటీ సభ్యులతో కలిసి శుక్రవారం వేడుకల బ్రోచర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ రోజు రాత్రి 8 గంటల నుంచి 12 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైశాఖి స్పోర్ట్సు పార్కు ప్రతినిధులు రొంగలి జగన్నాథం, ఉపాధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కోశాధికారి మళ్ల రామకృష్ణ, రఘురామ పండా, కేకే సురేష్, కె.మురళీధర్, చింతాడ రామారావు, ఎల్‌వీ సుధాకర్ పాల్గొన్నారు.